క్లుప్తంగా

మడ్డువలస గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా రాధిక



ప్రిన్సిపాల్ రాధికకు స్వాగతం పలుకుతున్న అధ్యాపకులు

వంగర: మడ్డువలసలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలిక గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌గా జె.రాధిక గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె చీపురుపల్లి గురుకులంలో జువాలజీ సబ్జెక్టు జేఎల్‌గా పనిచేసేవారు. పదోన్నతిపై ఇక్కడికి ప్రిన్సిపాల్‌గా వచ్చారు. ఆమెకు కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నవజీవన ట్రస్ట్ తరఫున సరుకులు పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

వంగర: తిరుపతికి చెందిన నవజీవన ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని కొప్పర వలస గ్రామంలో కొప్పరవలసతో పాటు బంగారువలస, కె.కొత్తవలస గ్రామాలకు చెందిన పేదలకు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అమృత కలశం పేరిట పేదలకు నెల రోజులకు సరిపడా బియ్యం, ఇతర సరుకులను అందజేశారు. అలాగే నవజీవన ట్రస్ట్ ఆధ్వర్యంలో కొప్పరవలసలో నిత్యాన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు సింహాచలం, జనార్దన్, గెంబలి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ



రైతులకు వరివిత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీ నాయన

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామంలో రైతులకు ఎమ్మెల్యే బేబీ నాయన గురువారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వరి విత్తనాలను రాయితీపై అందిస్తోందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగించుకోవాలని సూచించారు. వరి విత్తనాలను సూడోమోనస్ మందుతో శుద్ధి చేసుకుంటే పంటకు చీడపీడలు ఆశించవని చెప్పారు.వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామ్‌సుందర్, వ్యవసాయశాఖ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్దలు పాల్గొన్నారు.


మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఐ జిల్లా కార్యవర్గం

బొబ్బిలి: జూలై 26 నుంచి రెండు రోజుల పాటు పట్టణంలో జరిగే సీపీఐ 14వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. అనంతరం రమణ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలపై మహాసభల్లో తీర్మానిస్తామన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కండాపు ప్రసాదరావు, జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, జిల్లా కార్య వర్గ సభ్యులు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులు గొల్లపల్లి తాడు, కె.వి.సత్యనా రాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



సంతకవిటి: కృష్ణంవలసలో పూజలు చేస్తున్న భక్తులు

సంతకవిటి: కృష్ణంవలస గ్రామంలో అభయాంజనేయ, వేణుగోపాలకృష్ణ ఆలయ ప్రతిష్ఠత్సవాలు వేదపండి తులు పెంట వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో రెండో రోజు గురువారం భక్తులతో సూర్యనమస్కారాలు, వేదపారాయణం, క్షీరాధివాసం, కుంకుమ పూజలు చేయించారు.

పానుగుటివలసలో..

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి పానుగుటి వలసలో చెరువుగట్టుపై ఉన్న శివాలయంలో ఆంజనేయ, సుబ్రహ్మణ్యస్వామి వార్ల విగ్రహాలను గురువారం ప్రతిష్ఠించారు. వేదపండితులు రంపా హనుమంతుశర్మ, గిరిబాబు శర్మ ఆధ్వర్యంలో పూజలు, హోమాలు చేశారు. ఆలయం నిర్వాహకులు మధ్యాహ్నం అన్నదానం చేయగా, సుమారు 1,200 మంది అన్నప్రసాదం స్వీకరించారు.

ఆదాయం ఉన్నా.. అభివృద్ధి సున్నా

- అభివృద్ధికి నోచుకోని పైడితల్లి అమ్మవారి ఆలయం
- ఏటా రూ. 40 లక్షలకు పైగా ఆదాయం
- భక్తులకు కనీస సౌకర్యాలు కరువు
- తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు లేని వైనం



పైడితల్లి అమ్మవారి ఆలయం



పూజలందుకుంటున్న అమ్మవారు

రాజాం: భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి గాంచిన రాజాం పట్టణంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఏటా జాతర నిర్వహించే సమయంలో దేవదాయశాఖ, ఆలయ కమిటీ భక్తుల కోసం తూతూ మంత్రంగా, తాత్కాలికంగా ఏవో ఏర్పాట్లు చేయడమే తప్ప శాశ్వత అభివృద్ధి పనులు చేసింది లేదు. అమ్మవారి ఆలయానికి రాజాంతో పాటు తెర్లాం, బొబ్బిలి, పొందూరు, శ్రీకాకుళం, పాలకొండ ప్రాంతాల నుంచి నిత్యం అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. జాతర సమయంలో లక్షల్లో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. భక్తుల కానుకల రూపంలో ఆలయానికి ఏటా లక్షల రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ ఎలాంటి ప్రగతి కనిపించడం లేదు. ఎప్పుడో నిర్మించిన గర్భగుడి, ముందర భాగమే తప్ప భక్తుల రద్దీ దృష్ట్యా విస్తరణ చేసే ఆలోచనే చేయకపోవడం గమనార్హం. చిన్న గర్భగుడిలో అమ్మవారు కొలువుదీరి ఉండగా, జాతర సమయంలో ముందరభాగం నుంచి భక్తుల దర్శనాలు జరుగుతుంటాయి. ప్రత్యేక క్యూ కాంప్లెక్స్‌లు లేకపోవడంతో జాతర సమయంలో ఆలయ కల్యాణ మండపాన్నే క్యూ కాంప్లెక్స్‌గా వినియోగించాల్సి వస్తోంది. అలాగే ఆలయ వెనుకభాగాన దేవదాయశాఖ నిర్వహణకు సంబంధించిన భవనం లోనూ సదుపాయాలు లేవు. ఎంతో పేరుగాంచిన ఈ ఆలయంలో భక్తులకు తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, స్నానపు గదులు లేవంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. క్షౌరశాల లేక పోవడంతో భక్తులు ఆరుబయటే తలనీలా లు సమర్పించి, దగ్గరలో ఉన్న చెరువుల వద్దకు వెళ్లి స్నానాలు ఆచరించాల్సి వస్తోంది. మొక్కులు చెల్లింపునకు కూడా సరైన ఏర్పాట్లు లేవు. ఎంతో దూరం నుంచే వచ్చే భక్తులకు ఆలయం వద్ద సేదతీరేందుకు నిలువ నీడ లేక పోవడం శోచనీయం.

ఆదాయం అంతా ఖజానాకే..

ఆలయానికి ఏడాదికి రూ.40 లక్షలు దాటి ఆదాయం వస్తుంటుంది. ఏటా జాతర సమయంలో 15రోజుల వ్యవధిలో రూ. 23 నుంచి రూ.28 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఈఏడాది జాతరలో రూ. 26 లక్షల ఆదాయం వచ్చిందని దేవదాయ శాఖ అధికారులు ప్రకటించారు.అలాగే ప్రతీ 60 రోజులకు హుండీ ఆదాయం లెక్కిస్తే సగటున రూ.1.50 లక్షలు వస్తుంటుంది. ఈ ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారులు అలాగే తీసుకెళ్లి ప్రభుత్వ ఖజానాకు జమ చేసేస్తున్నా రే తప్ప ఆలయ అభివృద్ధిని పట్టించు కోవడం లేదన్న విమర్శలు భక్తుల నుంచి వినిపిస్తున్నాయి. ఆలయ విస్తరణతో పాటు సౌకర్యాలను మెరుగుపరచాలని భక్తులు కోరుతున్నారు.

కమిటీ చొరవ ఉండాలి

పోలిపల్లి పైడితల్లి ఆలయ రూపురేఖలు, భవన సముదాయాల్లో మార్పులు చేపట్టాలంటే కమిటీ ముందుగా సమావేశాలు, తీర్మాణాలు చేయాలి. ఆ నిర్ణయాలను తాము దేవదాయశాఖ ఉన్నతాధికారులకు పంపిస్తాం. అక్కడి నుంచి ఇంజినీర్లు వచ్చి కొత్త నిర్మాణాలు, భక్తుల వసతి సదుపాయాలపై దృష్టిసారిస్తారు. తాము కేవలం పర్యవేక్షకులుగా మాత్రమే ఉంటాం.

– బి.వి.మాధవరావు, ఆలయ ఈఓ,

సైబర్ నేరాలపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రసాదరావు

రామభద్రపురం: సైబర్ నేరాలపై గ్రామాల్లో యువతీ,యువకులకు,ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎస్‌ఐ వి.ప్రసాదరావు సూచించారు. మండలంలోని సచివాలయ మహిళా పోలీసు సిబ్బందితో స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన సమావేశమయ్యారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఇటీవల మండలంలో ఇన్‌స్టాగామ్ ఫేక్ ఐడీ ద్వారా ఓ మైనర్ బాలికను మోసం చేసేందుకు ప్రయత్నించిన యువకుడిని పట్టుకున్నామని చెప్పారు. వివిధ రకాలుగా వివిధ యాప్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. తెలియని వ్యక్తుల నుంచి మొబైల్‌కు వచ్చే లింక్‌లపై క్లిక్ చేయవద్దని, సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలకు చెప్పాలన్నారు. అలాగే గ్రామ పెద్దలు,ఆర్థికంగా బాగా ఉన్నవారి సహాయంతో గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.బెల్టు దుకాణాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

అనుమతులు పొందాకే నిర్మాణాలు ప్రారంభించాలి



మున్సిపల్ కమిషనర్, చైర్మన్, సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌డీడీ నాయుడు

బొబ్బిలి: ప్రభుత్వం విడుదల చేసిన నూతన జీఓల ప్రకారం అనుమతులు పొందాకే భవన నిర్మాణాలు ప్రారంభించుకోవాలని పట్టణ ప్రణాళికా విభాగం రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ పెనుగంటి నాయుడు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి , చైర్మన్ రాంబార్కి శరత్, పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బందితో గురువారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయ వనరులుగా ఉన్న ఆక్రమణ పన్నులు, ప్రకటనల పన్నులను మెరుగుపర్చాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టణ ప్రణాళికా కార్యదర్శి వార్డు ప్లానర్స్‌తో నిత్యం సందర్శించి రోజువారీ ముఖ్యమైన సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. భవన నిర్మాణ అనుమతులకోసం దరఖాస్తు చేసుకున్న ప్రజలకు కొత్త జీఓలపై అవగాహన కల్పించాలని సూచించారు.

సాక్షి ఎఫెక్ట్ — షట్టర్ల ఏర్పాటు



షట్టర్లను అమర్చుతున్న పనులను పర్యవేక్షిస్తున్న డీఈ రవీంద్రనాయుడు

సంతకవిటి: మండలంలోని రంగారాయపురం వద్ద నాగావళి నదిపై ఉన్న నారాయణపురం ఆనకట్ట కుడి ప్రధాన కాలువ, నదిలోకి నీటిని మళ్లించే హెడ్ రెగ్యులేటర షట్టర్లు, హెడ్‌స్లూయిస్ షట్టర్లను రెండు నెలల కిందట తొలగించి విడిచిపెట్టారు. గత నెల 26న 'ఆనకట్ట ఆధునీకీకరణ పూర్తయ్యేదెపుడో' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. తొలగించిన షట్టర్ల స్థానంలో కొత్త షట్టర్లను అమర్చే పనులను గురువారం ప్రారంభించారు. పనులను డీఈ వై.రవీంద్రనాయుడు, జేఈ శివాజీ పర్యవేక్షించారు.

ఈనెల 11న సర్వసభ్యసమావేశం

బొబ్బిలిరూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 11వ తేదీన మండల సర్వసభ్య సమా వేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈసమావేశానికి మండలంలోని ప్రజాప్రతిని ధులు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

సంక్షిప్తంగా...

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేగిడి: మండలంలోని సంకిలి 11 కేవీ ఫీడర్ పరిధి గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంద ని విద్యుత్‌శాఖ ఈఈ జి.సురేష్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్లు, చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సంకిలి, అప్పాపు రం, మజ్జిరాముడుపేట, వండానపేట, చాటాయివలస, ఉప్పర్నాయుడువలస, వన్నలి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని స్పష్టం చేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రుచికరమైన భోజనం అందించాలి



వంగర: వంటకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ జగదీశ్వరి

వంగర: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు వంట నిర్వాహకులు నాణ్యమైన, రుచికర భోజనం అందించాలని ఎంఈఓలు పి.ప్రవీణ్‌కుమార్, ఖండాపు జగదీశ్వరి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు వంటలపై గురువారం శిక్షణ ఇచ్చారు. వంట చేసే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు.

జీవామృతంతో చీడపీడలకు చెక్



జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: పంటలను ఆశించే చీడపీడలకు జీవామృతంతో చెక్ పెట్ట వచ్చని ఏఓ జి. మురళీకృష్ణ, ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కె.రమణ, ఆర్. సింహాచలం అన్నారు. ఉప్పరనాయుడువలస గ్రామంలో రైతులకు జీవామృతం తయారీ పై గురువారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల సాగులో రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగానికి స్వస్తి చెప్పి, ప్రకృతివ్యవసాయం చేయాలని సూచించారు. రైతులు సొంతంగా జీవామృతం తయారు చేసుకుని పంటలకు పిచికారీ చేసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ సిబ్బంది చెప్పారు. జీవామృతం తయారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. సర్పంచ్ కరణం గోవిందరావు, రైతులు పాల్గొన్నారు.

పూడిక, తుప్పల తొలగింపు



బూరాడ వద్ద తోటపల్లికాలువలో తుప్పలు తొలగిస్తున్న ఉపాధి వేతనదారులు

రేగిడి: మండలంలోని బూరాడ, చిన్నశిర్లాం, కొర్లవలస తదితర గ్రామాల పంటపొలాలకు సాగునీరందించే తోటపల్లి కాలువలో ఉపాధిహామీ వేతనదారులు గురువారం పూడిక, తుప్పలను గురువారం తొలగించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన ఈ పనులను ఏపీఓ ఎస్.హరనాథరావు పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో పంటపొలాలకు పూర్తి స్థాయిలో సాగునీరు అందేలా పనులు చేపట్టాలని వేతనదారులకు సూచించారు.

బోర్లకు మరమ్మతులు

వంగర: మండలంలోని సీతాదేవిపురంలో పాడైన రెండు తాగునీటి హ్యాండ్ బోర్లకు ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది గురువారం మరమ్మతులు చేశారు.కొద్ది రోజులుగా వినియోగానికి దూరంగా ఉన్న బోర్లను బాగు చేయడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

సచివాలయాల సందర్శన



అంతకాపల్లి సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: మండలంలోని అంతకాపల్లి, పొగిరి, శ్యాంపురం గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు గురువా రం సందర్శించారు.వివిధ శాఖలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమస్యలపై ప్రజలుఅందించే అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని, ప్రజలకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను సకాలంలో జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సమయపాలన పాటించకపోయినా, విధుల్లో అలసత్వం వహిం చినా చర్యలు తప్పవని అన్నారు. ఎంపీడీఓ వెంట ఆయా పంచాయతీల కార్యదర్శులు, వీఆర్‌ఓలు ఉన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

సంతకవిటి: తమ కుటుంబంపై మరో కుటుంబీకులు దాడి చేశారని తాలాడ గ్రామానికి సవలాపురపు లావణ్య గురువా రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఆర్.గోపాలరావు చెప్పారు. ఎస్‌ఐ తెలి పిన వివరాలు...పది రోజుల క్రితం ఇరు కుటుంబాల మధ్య తగాదా జరగడంతో గ్రామంలో రాజీ కుదిరింది. తర్వాత మళ్లీ తగాదా జరిగింది. మంగళవారం మళ్లీ తమ కుటుంబ సభ్యులపై దాడి చేశారని లావణ్య పిర్యాధు చేశారని ఎస్‌ఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నేత్రవైద్య శిబిరం



శిబిరంలో వృద్ధురాలికి నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్

రాజాం: కంచరాం గ్రామ సచివాలయంలో విజయనగరానికి చెందిన వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గురు వారం నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరాన్ని సర్పంచ్ గెడ్డాపు అప్పలనాయుడు ప్రారంభించారు. ఆప్తాలమిక్‌లు హైందవి, అనూరాధ 56 మందికి నేత్రపరీక్షలు చేసి 28 మందిని శస్త్రచికిత్సలకు ఎంపికచేసి, ఆపరేషన్ల నిమిత్తం విజయనగరంలోని ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. పీఆర్‌ఓ ఏ.లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి వెంకటరావు పాల్గొన్నారు.

టెండర్లు పూర్తయిన పనులను ప్రారంభించాలి

బొబ్బిలి: వర్షాలు ప్రారంభం కాకముందే టెండర్లు పూర్తయిన పనులు ప్రారంభించి పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్, మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. గురువారం కమిషనర్ చాంబర్‌లో మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది, నీటి సరఫరా విభాగం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కాలువలు, కల్వర్టుల మరమ్మతులు, పైపులైన్ల లీకులు అరికట్టే పనులను త్వరితగతిన ప్రారంభించాలని, వీధి దీపాల నిర్వహణ సక్రమంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సంద ర్భంగా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలలో, రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో, చెరువుగట్లపై గురు వారం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని, మొక్కలను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి: బొబ్బిలి కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న న్యాయమూర్తి రోహిణీ రావు



తెర్లాం: తెర్లాం జగనన్న కాలనీలో మొక్కలు నాటుతున్న జిల్లా వ్యవసాయ అధికారి రామారావు, ఎంపీపీ ఉమాలక్ష్మి



తెర్లాం: తెర్లాం అంగన్‌వాడీ కేంద్రం-5 వద్ద మొక్కలు నాటుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, లక్ష్మి, తదితరులు



బాడంగి: బాడంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న అధికారులు



వంగర: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ



రాజాం: రాజాం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ జనార్దనరావు, విద్యార్థినులు



బొబ్బిలిరూరల్: పిరిడి అంగన్‌వాడీ కేంద్రం వద్ద కొబ్బరి మొక్క నాటుతున్న ఎంపీపీ శంబంగి లక్ష్మి



సంతకవిటి: మండల కేంద్రంలోని సచివాలయం ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు



రేగిడి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



వంగర: మగ్గూరులోని ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏఓ కన్నబాబు

వంగర: మండలంలోని అరసాడ, వంగర, మగ్గూరు గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో ఏఓ తట్టికోట కన్నబాబు గురువారం తనిఖీలు చేశారు. దుకాణాల్లో ఎరువులతో పాటు వరి విత్తనాల నిలవ్వలను, రికార్డులను పరిశీలించారు. విత్తనాల మొలక శాతం నిర్ధారించిన తర్వాతే రైతులకు విక్రయించాలని దుకాణాల యజమానులకు సూచించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు విధిగా రసీదులు ఇవ్వాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాడంగిలో..

బాడంగి: మండల కేంద్రంలోని విత్తనాలు,'పురుగు మందుల దుకాణాల్లో ఏఓ కె.శిరీష గురువారం తనిఖీలు చేశారు. విత్తనాలు, పురుగు మందుల నిల్వలను, రికార్డుల్లో పొందుపరిచిన వివరాలను సరి చూశారు. అలాగే ఎఫ్‌టీఓ గిడ్డంగిలో 1121–రకం వరి విత్తనాల నిల్వలను పరిశీలించారు.

రేగిడి మండలంలో..

రేగిడి: మండలంలోని బూరాడ,రేగిడి, పనసలవలస గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో ఏఓ జి.మురళీకృష్ణ గురువారం తనిఖీలు చేశారు. నకిలీ పురుగు మందులు, విత్త నాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని దుకాణాల నిర్వాహకులను హెచ్చరించారు. ప్రభుత్వం సూచించిన పురుగు మందులు, ఎరువులనే విక్రయిం చాలని, రైతులను మోసగించే ప్రయత్నాలు చేస్తే చర్యలు తప్పవన్నారు.

రోడ్ల నిర్మాణానికి మూడు నెలలు పడుతుంది

- ఎమ్మెల్యే బేబీ నాయన

సాక్షి ఎఫెక్ట్



మాట్లాడుతున్న బేబీ నాయన

బొబ్బిలి: పట్టణానికి పాత బొబ్బిలికి మధ్యన, మండలంలోని గొర్లె సీతారాంపురం వద్ద రహదారులు దారుణంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్‌కు బుధవారం వివరించామని ఎమ్మెల్యే బేబీ నాయన చెప్పారు. ''నాయనా.. ఇది వెన్నుపోటు కాదా.?'' శీర్షికతో ఈనెల 4న సాక్షి దినపత్రిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. కోటలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రహదారులు పూర్తిగా పాడయ్యాయని కలెక్టర్‌కు వివరించి నిధుల గురించి అడిగితే రూ.10లక్షలు ఇస్తామన్నారన్నారు. రోడ్ల మరమ్మతులకు రూ.4.50 కోట్లు మంజూరయ్యాయని, అవి విడుదలై టెండరు ప్రక్రియ పూర్తయ్యి, పనులు ప్రారంభించేసరికి మూడు నెలల సమయం పడుతుందన్నారు. ఈలోగా మున్సిపాలిటీలోని కాలేజ్ రోడ్డు, గొర్లె సీతారాంపురం, పాత బొబ్బిలి రహదారులకు తాత్కాలిక మరమ్మతులకు కలెక్టర్ ఇస్తామన్న రూ.10 లక్షలకు, మున్సిపాలిటీ నిధులు, నా సొంత నిధులు రూ. 5లక్షలు చొప్పున ఖర్చు చేస్తామని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్, ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, అల్లాడ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వంద రోజులు.. వంద మొక్కలు



వైఎస్సార్ పార్కులో మొక్కను నాటుతున్న మున్సిపల్ కమిషనర్, తదితరులు

రాజాం సిటీ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా వాసవీక్లబ్ మన రాజాం – సారథి ఆధ్వర్యంలో వంద రోజులు– వంద మొక్కలు కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే వాసవీక్లబ్ వనిత శక్తి సభ్యులు పట్టణంలోని వైఎస్సార్ పార్కులో మొదటి మొక్కను మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు చేతులు మీదుగా నాటించారు. కార్యక్రమంలో ఆర్.వి.జె.నాయుడు, టి.టి.వి.రమణమూర్తి, కొత్తా సాయి, కె.రవి, వి.పైడిరాజు, రమ తదితరులు పాల్గొన్నారు.

మాకెందుకు బాబు ఈ రేషన్ కష్టాలు ..?



ఎనుబరువు చింతలవలస రేషన్‌దుకాణం వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

రామభద్రపురం: ఐదేళ్ల పాటు నిశ్చింతగా ఇంటి వద్దనే రేషన్ సరుకులు తీసుకున్నాం.ఇప్పుడు పనులు మానుకుని కొండలు దిగి సరుకుల కోసం రేషన్ దుకాణానికి రావాల్సి వస్తోంది, మాకెందుకు ఈ రేషన్ కష్టాలు బాబూ అంటూ గిరిజన గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రావివలస పంచాయతీ పరిధిలోని ఎనుబరువు చింతలవలసలోని గ్రామంలో రేషన్ దుకాణం ఉంది. ఈ దుకాణం పరిధిలో రావివలసతో పాటు సుమారు 8 గిరిజన గ్రామాలున్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఎనిమిది గ్రామాల్లోని లబ్ధిదారులకూ ఇంటి ముంగిటకే ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు అందేవి. తాజాగా కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీని రద్దు చేయడంతో పాతపద్ధతిలో రేషన్ దుకాణాల వద్ద సరుకులు విడిపించుకోవాల్సి వస్తోంది. 5 నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరిజనులు ఎనుబరువు చింతలవలసలోని రేషన్ దుకాణానికి నడిచి వచ్చేందుకు, తిరిగి బియ్యం మూటలను మోసుకుని ఇళ్లకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ తీరుపై గిరిజనులు మండిపడుతున్నారు.